## క్లుప్తంగా

### ముగిసిన పంచాయతన యాగం


చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న సంతోషి మాత సహిత పంచాయతన యాగ మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఆలయ అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు, సూర్య నమస్కారాలు, ప్రత్యేక పారాయణలు, 13 పట్టుచీరలతో చండీహోమం, శత కలశాలు, పరిమళ సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకం, 58 రకాల ద్రవ్యాలతో మహా పూర్ణాహుతి జరిగింది. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### విద్యలో నైపుణ్యాలు కీలకం


మాట్లాడుతున్న కౌశిక్ అగస్త్యరాజ్

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యలో నైపుణ్యాలు కీలకమని విశాఖపట్నంకు చెందిన వీఆర్‌డీ ఇంజినీరింగ్ అకాడమీ అధ్యాపకుడు వీఆర్‌డీ కౌశిక్ అగస్త్యరాజ్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో రీసెర్చ్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'ఎంపవరింగ్ ఫ్యూచర్ ఇన్నోవేటర్స్ ఎక్స్‌ప్లోరింగ్ ఇంజినీరింగ్ కెరీర్ అండ్ ఆపర్చ్యునిటీస్' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం చేశారు. విద్యార్థులు ఇంజినీరింగ్ చదువుతుండగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాల నోటిఫికేషన్లకు అనుగుణంగా సిద్ధం కావాలన్నారు. సమయం వృథా చేయకుండా ఆన్‌లైన్ కోర్సులు, నైపుణ్య కోర్సులు నేర్చుకోవాలని సూచించారు. గేట్ పరీక్ష వల్ల సైతం జాతీయ విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్ పీజీకి మంచి అవకాశం ఉంటుందన్నారు.

### లయన్స్ క్లబ్ సేవలు నిరుపమానం


ఎమ్మెల్యే గొండు శంకర్‌కు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: లయన్స్ క్లబ్ సెంట్రల్ సేవలు నిరుపమానమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక విశాఖ-బీ కాలనీలోని పార్టీ కార్యాలయంలో లయన్స్ క్లబ్ సెంట్రల్ సభ్యుల నుంచి ప్రశంసాపత్రాన్ని సోమవారం ఆయన అందుకున్నారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### కల్లేపల్లిలో కంటి వైద్య శిబిరం


కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కల్లేపల్లి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శంకర్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 70 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 15 మందిని ఆపరేషన్‌కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరత్నం, గంగు నరేంద్రకుమార్, మూకళ్ల తాతబాబు, బాన రామకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### దుర్గాదేవి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు


పూజలు చేస్తున్న భక్తులు

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి గ్రామంలో నిర్మించిన దుర్గాదేవి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన వేడుకల్లో భాగంగా వేద పండితుల సమక్షంలో దుర్గాదేవిని ప్రతిష్ఠించారు. అనంతరం గ్రామంలో భారీ అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రకృతి సాగు.. లాభాలు బాగు


ప్రకృతి సేద్యంతో పండించిన పంట

- లాభదాయకంగా ప్రకృతి సేద్యం
- ప్రతిఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్


సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్న దృశ్యం


పండించిన కూరగాయల ప్రదర్శన చేస్తున్న రైతులు

ఎచ్చెర్ల: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుండడంతో ప్రకృతి సేద్యంపై అన్నదాతలు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ప్రతిఏటా సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. సాధారణంగా పొలాల్లో పంటల సాగు చేసేటప్పుడు రసాయనిక ఎరువుల వాడకం వలన భూసారం కోల్పోవడం జరుగుతుంది. ఈ క్రమంలో పంటల దిగుబడి ఆశించినంతగా రావడం లేదు. అదే ప్రకృతి వ్యవసాయం చేస్తే సేంద్రీయ ఎరువుల వినియోగంతో ఆరోగ్యవంతమైన ఫలసాయం అధికంగా వస్తోంది. ప్రకృతి వ్యవసాయోత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ కూడా ఉండడంతో ఆర్థికంగా సైతం మేలు జరుగుతోంది.

**సాగుకు ప్రోత్సాహం**

ప్రకృతి వ్యవసాయానికి ఎంపిక చేసిన గ్రామాల్లో రైతులను ప్రోత్సహించడం జరుగుతోంది. రైతులకు సాగులో మెలకువలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నేర్పిస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని మండలాల్లో క్లస్టర్లుగా ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పండిస్తున్నారు. ఎచ్చెర్ల మండలంలోని కేశవరావుపేట, ఫరీదుపేట, ఎస్ఎంపురం, ధర్మవరం, కొంగరాం తదితర గ్రామాల్లో ఈ పంటలను పండిస్తున్నారు. మొత్తం నియోజకవర్గంలో దాదాపు 2000 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

**భూసారం కాపాడే ఎరువులు**

ప్రకృతి వ్యవసాయంలో భూసారం కాపాడే ఎరువుల వినియోగం జరుగుతుంది. ప్రకృతి సిద్ధంగా లభించే పదార్థాలు, ద్రావాలతో తయారు చేసిన ఎరువులు, క్రిమి సంహారక కషాయాలను వినియోగిస్తున్నారు. రసాయనిక ఎరువుల కంటే ఇవి తక్కువ ధరకు లభిస్తుండడంతో వీటిపై దృష్టి నిలిపారు. జీడిమామిడి పూతలపై పురుగుల నివారణకు, పూత నిలవడానికి మజ్జిగ, ఇంగువ, బెల్లం మిశ్రమ ద్రావణాన్ని, ఎరువుగా వాడడానికి ఆవుపేడ, బెల్లం, పప్పు దినుసుల పిండి, తగినంత గోమూత్రాన్ని కలిపి మిశ్రమంగా తయారు చేసిన ఉండలను పంటలకు ఎరువుగా వాడుతున్నారు. అలాగే వీటికి నీటిని కలిపి తయారు చేసిన ద్రవ జీవామృతాన్ని పంటలపై చీడ, పీడల నివారణకు, పంట బలంగా ఎదిగేందుకు వినియోగిస్తున్నారు. అగ్గి తెగులు నివారణకు మారేడు కషాయం, వరిలో సుడిదోమ నివారణకు రేడియో మొక్కల ఆకులతో తయారు చేసిన కషాయం, వైరస్ నివారణకు పేడ కషాయం, పురుగుల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం వంటి కషాయాలను వినియోగిస్తూ పంటలను పండిస్తున్నారు. వీటిని కొందరు రైతులు స్వయంగా తయారు చేసుకుంటున్నారు. మరికొందరు ఆయా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం వారు ఏర్పాటు చేసిన మినీ దుకాణాల ద్వారా కొనుగోలు చేసుకుని వ్యవసాయానికి వినియోగిస్తున్నారు. ప్రకృతి సేద్యంలో ఎరువుల తయారీకి అయ్యే ఖర్చు తక్కువే. తయారీ కూడా సులభమే కావడంతో రైతులు ఎక్కువగా ఈ రకమైన వ్యవసాయం చేసేందుకు ఉత్సుకత కనబరుస్తున్నారు.

**ప్రభుత్వం ప్రోత్సహించాలి**



ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయన్ని ప్రోత్సహించాలి. సాగుకు అవసరమైన పరికరాలు, విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందించాలి. ప్రస్తుతం మార్కెట్‌లో ప్రకృతి వ్యవసాయోత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. రైతులు కూడా క్రమక్రమంగా ప్రకృతి సేద్యానికి ఇష్టపడుతున్నారు. ప్రభుత్వం ఆర్థికంగా సాయం చేస్తే మరిన్ని సత్ఫలితాలు ఉంటాయి.

– శ్రీనివాసరావు, రైతు, కొంగరాం

**పూర్తిస్థాయి సేద్యానికి కృషి**



ఎచ్చెర్ల మండలంలోని 22 పంచాయతీల్లో ప్రకృతి సాగు చేస్తున్నారు. మిగిలిన వారు పాక్షికంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి వ్యవసాయం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రకృతి సేద్యానికి కృషి చేస్తున్నాం. రైతుల్లో నమ్మకం పెరగడం వలన గతేడాది కంటే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగింది.

– సీహెచ్ సూర్యనారాయణ, ఎస్‌డీఏ, ప్రకృతి వ్యవసాయం

## దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించాలి



పలు శాఖల అధికారులతో జడ్జి భాస్కరరావు తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని శ్రీకాకుళం ఒకటో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి దివ్యాంగ పిల్లలను గుర్తించే ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సారథ్యంలో దివ్యాంగ పిల్లలను గుర్తించడంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి సర్వేను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి విభిన్న ప్రతిభావంతులను గుర్తిస్తామన్నారు. కార్యక్రమంలో మూడో అదనపు జిల్లా జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్, నాల్గో అదనపు జిల్లా జడ్జి ఎస్ఎం ఫణికుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

### బిక్కుబిక్కుమంటూ..!



ఎచ్చెర్ల మండలంలోని కొయ్యాం పంచాయతీ నిమ్మవానిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. శ్లాబ్ పెచ్చులూడడంతో పాటు గోడలు బీటలు వారాయి. అందువలన నూతన భవనాలు నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలలో 26 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా, ఈ భవనాల్లోనే కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రంలో 12 మంది చిన్నారులు ఉన్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్


## పాత పెన్షన్ విధానం అమలు చేయాలి


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

జి.సిగడాం: డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని జి.సిగడాం మండల ఉపాధ్యాయుల కన్వీనర్లు బూరు అచ్యుతరావు, చదువుల టార్జానబాబు కోరారు. మండల కేంద్రంలో ఉపాధ్యాయుల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చంద్రబాబు హయాంలో 2003 సంవత్సరం నవంబర్ 13న డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. వెంటనే పరీక్ష నిర్వహణతో పాటు ఫలితాలు కూడా 2004 సెప్టెంబర్ 1 ముందే వచ్చాయని, అందువలన తమకు ఓపీఎస్ అమలు చేయాలని విన్నవించారు. సమావేశంలో మొయ్యి జనార్దనరావు, వల్లూరు రమణ, శ్రీనివాస్ పట్నాయక్, మక్క గంగేశ్వరి, జి.స్రవంతి, ఆర్.రేణుక, బెల్లాన చంద్రమౌళి, బెవర ఉమామహేశ్వరరావు, బి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌పై వెబినార్


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు


నేషనల్ వెబినార్‌లో మాట్లాడుతున్న వక్తలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటానమస్) కళాశాలలో కేంద్ర బడ్జెట్‌పై జాతీయ స్థాయి వెబినార్‌ను కళాశాల అర్థశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో మధ్య తరగతి ప్రజలకు, నిర్ణీత ఆదాయ వర్గాల ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. విజ్ఞాన్ డీమ్డ్ యూనివర్సిటీకి చెందిన విశ్రాంత రిజిస్టర్ డాక్టర్ ఎ.లీలామోహన్ మాట్లాడుతూ ఈ బడ్జెట్ వికసిత్ భారత్-2047కి నాంది పలుకుతుందని, ఆ దిశగా కేటాయింపులు జరిగాయని పేర్కొన్నారు. రిసోర్స్ పర్సన్ డాక్టర్ జెట్టి పాండురంగారావు (పీఆర్ కాలేజ్ (అటానమస్) కాకినాడ) మాట్లాడుతూ ఈ బడ్జెట్ ద్వారా ఆదాయ పన్ను విషయంలో మిడిల్ ఇన్కమ్ గ్రూప్ చెందినవారికి, కనీస వేతనం పొందినవారికి లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగాధిపతి, వెబినార్ కన్వీనర్ టి.ఆదిలక్ష్మి, నేషనల్ వెబినార్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బి.ప్రభాకర్‌రావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకర్‌నారాయణ, అకడమిక్ కో-ఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మా.. కరుణించమ్మా..!


పదేళ్ల క్రితం నిర్మించిన ఆలయం

- నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం
- వందేళ్లకు పైగా కొలుస్తున్న భక్తులు


పూజలందుకుంటున్న ముత్యాలమ్మ

శ్రీకాకుళం కల్చరల్: ప్రతీ గ్రామాన్ని రక్షిస్తూ.. ప్రజలను కాపాడే కల్పవల్లిగా గ్రామ దేవత ఉంటుంది. అలాగే శ్రీకాకుళం పట్టణానికి ఎంతో ప్రసిద్ధి చెందిన తల్లిగా ముత్యాలమ్మ నిలుస్తుంది. నగరంలోని ఉన్న భక్తులు ప్రతీ మంగళవారం కాకివీధిలో ఉన్న ఆలయానికి వెళ్లి పసుపు, కుంకుమ, ముర్రాటలు సమర్పిస్తుంటారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం నుంచి వైభవంగా నిర్వహించనున్నారు. ఆరోజున అమ్మవారి నిజరూప దర్శనం, మూలవిరాట్‌కు క్షీరాభిషేకాలు, పసుపు కుంకుమలతో ముర్రాటలు, పంచామృతాభిషేకాలు జరుగుతాయి.

**వందేళ్ల చరిత్ర**

గ్రామ దేవతగా శ్రీకాకుళంలో వెలసిన అమ్మవారు ముత్యాలమ్మ తల్లి. వందేళ్ల క్రితం అమ్మవారి పాదాలు గూనపాలెంలోని ఒకరి ఇంట్లో రోలు కింద నుంచి బయటకు వచ్చాయని చెబుతుంటారు. ఇలా వచ్చిన అమ్మవారి పాదాలను గ్రామ దేవతగా భావించి, ఊరి పొలిమేరలో వాటిని ఉంచి పూజలు చేయడం ప్రారంభించారు. క్రమేపీ భక్తులు పెరగడంతో పందిరి వేసి కొన్నాళ్లు పుజలు చేశారు. అనంతరం షెల్టర్‌ను నిర్మించి చిన్న గుడి మాదిరిగా నిర్మించారు. తదుపరి పదేళ్ల క్రితం రూ.కోటి వ్యయంతో ఆలయ నిర్మాణం చేపట్టారు. ముత్యాలమ్మ పాదాలకు పూజలు చేసే ముందు బండార్లమ్మ తల్లిని వేపచెట్టుగా భావిస్తారు. అమ్మవారిని కొలిచేందుకు పూజారులుగా 7 కుటుంబాలకు చెందిన సభ్యులు ఉంటారు.

**భక్తుల ఇలవేల్పుగా**

భక్తులకు ఇలవేల్పుగా, మహిళల కొంగు బంగారంగా అమ్మవారు నిలుస్తోంది. వేలాది మంది భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందుతున్నారు. ఇంట్లో శుభకార్యం, కొత్త వాహనాలు కొనుగోలు చేసినా ఇక్కడికి ముందువచ్చి అమ్మవారిని దర్శించుకొని మొదలుపెడతారు

– కస్పా మహేష్, శ్యామలరావు, జి.సిమ్మన్న, ముత్యాలమ్మ తల్లి ఆలయం పూజారులు

# రక్తహీనతకు చెక్ పెడదాం

- పాఠశాలలు, అంగన్‌వాడీల్లో ఆల్బెండజోల్ పంపిణీ
- పర్యవేక్షించిన డీపీఎంవో రవీంద్రరెడ్డి


రణస్థలం: లంకపేట కేజీబీవీలో డీవార్మింగ్ మాత్రలు వేస్తున్న వైద్యురాలు యమున

గార: బాలికల్లో రక్తహీనత నివారణకు సమష్టి కృషి చేద్దామని డీపీఎం రవీంద్రరెడ్డి అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంపోలులో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. శ్రీకూర్మం పీహెచ్‌సీ పరిధిలో 6,339 మందికి గానూ 6,250 మందికి మాత్రలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు ఎం.మనోజ్‌బాబు, వీవీఎస్ఎన్ మూర్తి, ఎంపీహెచ్‌వో ప్రభాకరరావు, శ్యామ్, జి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

**ఆరోగ్యంగా ఉంటేనే విజయాలు**

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే విజయాలు సాధించడం సులభతరం అవుతుందని హర్షవల్లి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, లయన్స్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ చైర్మన్ హారికప్రసాద్ అన్నారు. నగరంలోని మున్సిపల్ స్కూల్స్‌లో చిన్నారులకు డీవార్మింగ్ మాత్రలను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రివెంటివ్ మెడిసిన్ లయన్స్ ఇంటర్నేషనల్ చైర్మన్ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, లయన్ పార్వతీశ్వరరావు, లయన్ సరళి తదితరులు పాల్గొన్నారు.

**నులి పురుగుల నియంత్రణ అవసరం**

ఎచ్చెర్ల క్యాంపస్: పాఠశాల స్థాయి పిల్లల్లో నులి పురుగుల నియంత్రణ అవసరమని ఎచ్చెర్ల ఎంపీడీవో సీపాన హరిహరరావు అన్నారు. చిలకపాలేంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. నులి పురుగులు వలన చిన్నారుల్లో అనేక సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని పాతర్లపల్లి, రావాడ పీహెచ్‌సీల పరిధిలోని పర్యవేక్షణ అధికారి పి.సుజాత ఆధ్వర్యంలో విద్యార్థులకు డీ-వార్మింగ్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో పాతర్లపల్లి, రావాడ పీహెచ్‌సీల వైద్యులు కృష్ణ చైతన్య, పి.జనార్ధన్ నాయుడు, ఎస్.యమున, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, ఎంఈవో ఎ.త్రినాథరావు, ఏవో ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విద్యార్థులకు డీ-వార్మింగ్ మాత్రలు అందిస్తున్న దృశ్యం

జి.సిగడాం: చిన్నారులకు వ్యాధులు ప్రబలకుండా డీ-వార్మింగ్ మాత్రలు వేయాలని వైద్యాధికారి పేకల సుమబిందు సూచించారు. స్థానిక మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్ లెంక ఆధ్వర్యంలో విద్యార్థులకు మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు, ఎంఈవోలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


గార: అంపోలు జెడ్పీ హైస్కూల్‌లో ఆల్బెండజోల్ మాత్రలు వేసుకుంటున్న విద్యార్థులు


ఎచ్చెర్ల క్యాంపస్: నులి పురుగుల మాత్రలు పిల్లలకు వేయిస్తున్న దృశ్యం



జి.సిగడాం: చిన్నారులకు మాత్రలు వేస్తున్న దృశ్యం

### జోరుగా ఫ్లై ఓవర్ పనులు


కొనసాగుతున్న ఫ్లై ఓవర్ పనులు

రణస్థలం: రణస్థలం టౌన్‌లో జాతీయ రహదారుల సంస్థ నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులు జోరుగా సాగుతున్నాయి. సగం రహదారి మూసివేసి వేగ నియంత్రణ బోర్డులు పెట్టి నిర్మాణ పనులు చకచకా జరిపిస్తున్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా 25 ఓపెన్ ఫిల్లర్లుతో కూడిన పైవంతెన వస్తుందని, దీనిలో భాగంగానే మట్టి నమూన పరీక్షలు చేస్తున్నామని హైవే అధికారులు చెబుతున్నారు.

### విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

ఎచ్చెర్ల: ఏపీ బయాలజీ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌లో, లావేరు మండలం తామాడ గ్రామంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో విద్యార్థులను పాఠశాలలో ప్రిన్సిపాల్ డానియల్, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ వెంకటరావులు సోమవారం అభినందించారు.

### గురుకుల విద్య వినియోగించుకోవాలి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో విద్యను సద్వినియోగం చేసుకోవాలని దుప్పలవలస అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు సూచించారు. పాఠశాలలో సోమవారం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో ఐదో తరగతిలో 80 సీట్లుకు, ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 80 సీట్లకు పరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. మార్చి 3వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 6వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 87909 39186, 83320 40190 నంబర్లను సంప్రదించాలని కోరారు.